5న మాతారాణి కా విశాల్ జాగరణ్

జియాగూడ: అక్టోబర్ 5న ధూల్‌పేట్ నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 16వ వార్షికోత్సవ మాతా రాణికా విశాల్ జాగరణ్ కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహిస్తామని సమితి చైర్మన్ ఎం.శ్రీధర్ బాబు, వైస్ చైర్మన్ కె.సత్యనారాయణ, అధ్యక్షుడు టి.జితేందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణా, కోశాధికారి నిమేష్ నిమేష్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలో జాగరణ్ బ్రోచర్, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురానాపూల్ రహీంపురా డాక్టర్ అంబేడ్కర్ భవన్ ప్లే గ్రౌండ్‌లో జరిగే జాగరణ్ శనివారం రాత్రి 8 గంటలకు ప్రారంభం అవుతుందని, ఇందులో ప్రత్యేక ఆకర్షణగా మా శక్తి యువ మండల్ భాగ్యనగర్ ప్రముఖ గాయకులు ఠాకూర్ రవి సింగ్, సుశ్రీ సాక్షి చోప్రా, రాజన్‌కుమార్, వేషధారణలు మౌంటీ నటరాజన్ అండ్ టీమ్, లంగర్ ప్రసాద్, చెప్పన్‌భోగ్, ట్వింకలింగ్ లైటింగ్, అఖండ జ్యోతి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు ఎం.మహేష్, పి.రవీందర్ సింగ్, ఠాకూర్ విపిన్ రాజ్‌సింగ్, ఉపాధ్యక్షులు సదానందం గుప్తా, రాజన్‌కుమార్, సచిన్ రాజ్ సింగ్, రోమీ ఆరోరా, పి.రంజిత్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎన్.సందీప్ సింగ్, రాజు కత్రి, సహా కార్యదర్శులు మనోజ్, నితిన్, సంతోష్, సతీష్ కుమార్, సదాశివ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పర్యాటక రంగం అభివృద్ధి చెందాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో పర్యాటక రంగం ఇంకా అభివృద్ధి చెందాలని పర్యాటక శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పినాకిని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ పర్యాటక అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో ఎన్నో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. తాను చైర్మన్‌గా ఉన్నప్పుడు పర్యాటక రంగ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసినట్లు తెలిపారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు లయన్ భారతి, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, సినీ దర్శకుడు చంద్రమహేష్, ఎన్టీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాంచంద్రరావు, అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు పాల్గొన్నారు.



అవార్డును అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం అందరికీ ఆదర్శం

నాంపల్లి: కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని జనరల్ మేనేజర్ కో ఆర్డినేషన్ ఎస్‌డీఎం సుభాని పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం కొండా లక్ష్మణ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవికి రాజీనామా చేసిన గొప్ప వ్యక్తిగా బాపూజీ నిలుస్తారని పేర్కొన్నారు. జనరల్ మేనేజర్ మార్కెటింగ్ రవి ప్రసాద్, అడిషనల్ జనరల్ మేనేజర్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ చక్రవర్తి చీఫ్ ఆఫ్ పవర్ విశ్వనాథరాజు, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు బోడభద్రు పాల్గొన్నారు.



బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతున్న ఎస్‌డీఎం సుభాని

మా ఇళ్లను కూల్చొద్దు

- రోడ్డెక్కిన వివిధ బస్తీలవాసులు
- జియాగూడ జాతీయ రహదారి దిగ్బంధం
- మూడు గంటల పాటు ధర్నా, నిరసనలు

జియాగూడ: మూసీ రివర్ అభివృద్ధి అంటూ సర్వే చేసి నోటీసులు ఇవ్వడానికి వచ్చిన అధికారులపై బస్తీలవాసులు ఆందోళనకు దిగారు. నిరసనలు, ధర్నా, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి జియాగూడ 100 ఫీట్ల జాతీయ రహదారిని 3 గంటల పాటు దిగ్బంధం చేశారు. జియాగూడ కేసరి హనుమాన్ చౌరస్తా వద్దకు చేరుకున్న కుల్సుంపురా ఏసీపీ మునావర్, ఇన్‌స్పెక్టర్ సునీల్ బస్తీలవాసులను సముదాయించే ప్రయత్నం చేశారు.

సర్వేకు వచ్చిన అధికారులు..

శుక్రవారం ఉదయం 9.30 గంటలకు జియాగూడ జాతీయ రహదారి పక్కన ఉన్న కమేలా రోడ్, దరియాబాగ్, కేసరినగర్, నవోదయా గంగానగర్, గిరికపల్లి, ప్రాంతాల్లో సర్వే చేయడానికి ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, గండిపేట, రాజేంద్రనగర్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిబ్బంది, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చేరుకొని సర్వే చేయగా 127 ఇళ్లు మూసీ రివర్ బెల్ట్‌కు వస్తున్నాయని అధికారులు గుర్తించారు. అలాగే 3, 4 నివాసాలకు ఆర్‌బి అతికించారు. ఇంటి జిరాక్స్ కాపీ ఇస్తే డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం..

30 ఏళ్లుగా ఉంటున్న ఇళ్లను ఎలా కూల్చివేస్తారంటూ పలు బస్తీలవాసులు జియాగూడ 100 ఫీట్ల జాతీయ రహదారిలో ధర్నా చేసి సీఎం దిష్టిబొమ్మను తగులబెట్టారు. బీజేపీ నాయకుడు రఘునాథ్ మాట్లాడుతూ..కష్టార్జితంతో కట్టుకున్న నివాసాలు వదిలి పొమ్మన్న ప్రభుత్వంతో ఎంతకైనా పోరాటానికైనా సిద్ధమన్నారు. కాంగ్రెస్ నాయకుడు జీవన్ సింగ్ చేరుకొని బస్తీవాసులతో మాట్లాడారు.



జియాగూడ జాతీయ రహదారి వద్ద ధర్నా చేస్తున్న బస్తీల వాసులు

నివేదికను కలెక్టర్‌కు పంపిస్తాం..

జియాగూడ జాతీయ రహదారి పక్కన ఉన్న నివాసాలకు సర్వే చేయడానికి మాత్రమే వచ్చాం. నిర్వాసితులు అడ్డుకోవడంతో కొంత వరకే మార్కింగ్ చేశాం. ఈ నివేదికను కలెక్టర్‌కు పంపిస్తాం.

– జ్యోతి, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్



దరియాబాగ్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు



లంగర్‌హౌస్ వద్ద..

దరియాబాగ్ వద్ద..

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన అంటూ తమ ఇళ్లను కూల్చడానికి సిద్ధమైందంటూ కార్వాన్ దరియాబాగ్‌లోని మహిళలు శుక్రవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో సీఎం డౌన్ డౌన్ అంటూ రోడ్లపై భారీ ఎత్తున మహిళలు తమ నిరసన వ్యక్తం చేశారు. అడ్డాల కార్తీక్, బీజేపీ కార్వాన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ కట్ల అశోక్ తదితరులున్నారు.

అధికారులను జైలులో పెట్టి తమ వద్దకు రండి

లంగర్‌హౌస్: మూసీ బాధితుల ఆందోళన ఉత్కంఠ భరితంగా కొనసాగింది. లంగర్‌హౌస్‌లోని వివిధ బస్తీల్లో అధికారులు గురువారం తిరుగుతూ మార్క్ వేశారు. తమ ఇళ్ల జోలికి రావద్దంటూ వారు ఆందోళనకు దిగారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే కౌసర్ అక్కడకు చేరుకొని రాత్రి వేళ ఆందోళనలు వద్దని సర్ది చెప్పారు. శుక్రవారం ఉదయం తమ వద్దకు కలెక్టర్‌ను పిలిపించాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. ప్రయోజనం లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయ ముట్టడికి తరలివెళ్లారు. అక్కడ తహసీల్దార్ బయటకు రాకపోవడంతో మొఘల్‌నగర్ రింగ్‌రోడ్డు వద్దకు వెళ్లి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ వెంటనే గోల్కొండ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి బాధితులను పిలిపించి మాట్లాడే ప్రయత్నం చేశారు. తమకు నిర్మాణ అనుమతులు ఇచ్చిన వివిధ శాఖల అధికారులను జైలులో పెట్టాకే తమ వద్దకు రావాలని మొండిగా బైఠాయించారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

అబిడ్స్: కాంగ్రెస్‌తోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఆల్ ఇండియా కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. నగరం నుంచి హరియాణాకు తరలివెళ్లి అక్కడ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. హరియాణాతో పాటు దేశ నలుమూలలా కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే దేశం అన్ని రంగాల్లో సుభిక్షంగా ఉంటుందన్నారు.



ప్రచారంలో పాల్గొన్న నిర్మల్‌కుమార్‌యాదవ్

స్విమ్మింగ్‌లో సత్తాచాటిన మనీష్

గన్‌ఫౌండ్రీ: ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సెయింట్ జోసెఫ్ కళాశాలకు చెందిన మనీష్ గౌడ్ సత్తాచాటారు. వివిధ విభాగాల్లో మూడు బంగారు పతకాలను సాధించి ప్రతిభను కనబరిచాడు. జీహెచ్‌ఎంసీ క్రీడా విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ ఈ సందర్భంగా ఆయనను అభినందించారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



బీజేపీ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

అఫ్జల్‌గంజ్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్ పేర్కొన్నారు. ఈడీ దర్యాప్తు సంస్థచే మంత్రి పొంగులేటి నివాసాలపై దాడులు చేయడం సరైంది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుంటే మోదీ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతుందన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం దూసుకుపోతుండడంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తట్టుకోలేకపోతుందని గౌరీ సతీష్ అన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉంటుందన్నారు.



గౌరీ సతీష్

నేడు సంతాప సభ



అబ్దుల్ కరీం(ఫైల్)

చార్మినార్: గుండెపోటుతో మాజీ ఆర్మీ సైనికుడు షేక్ అబ్దుల్ కరీం మృతి చెందడంపై పలువురు అధికార, అనధికార ప్రముఖులతో పాటు కుటుంబ సభ్యులు సంతాపం తెలిపారు. 1971లో స్పెషల్ అవార్డు పొందిన ఆయన సంతాప సభ ఈనెల 28న సులేమాన్ నగర్ లోని మజీద్-ఈ-అబ్దుల్ రెహమాన్ వద్ద జరుగుతుందని ఆయన కుమారులు షేక్ అబ్దుల్ వాషేద్ (9866034171) తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, తోటి మాజీ ఆర్మీ సైనికులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

అభినందనలు



చార్మినార్: బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ కుమారుని వివాహ మహోత్సవానికి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పాతబస్తీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకల్లో ఆయనతో పాటు మాజీ హోం శాఖ మంత్రి మహమ్మద్ మెహమూద్ అలీ, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ తదితరులు హాజరై అభినందనలు తెలిపారు.

చౌరస్తాలు, ఫ్లైఓవర్ల కూడళ్ల సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం

గోల్కొండ: ప్రధాన చౌరస్తాలు, ఫ్లై ఓవర్ల కింద ఉన్న కూడళ్లను సుందరీకరణ చేసేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన హకీంపేట్ సనా హోటల్ వద్ద ఉన్న తన కార్యాలయంలో బల్దియా అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. టూంబ్స్ చౌరస్తా, టోలిచౌకీ, ఫ్లై ఓవర్ కూడలి, నానల్‌నగర్ జంక్షన్, లంగర్‌హౌస్ కూడలి తదితర ప్రాంతాల సుందరీకరణకు తాను బల్దియా అధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ విషయంపై బల్దియా కమిషనర్‌తో సైతం పలుమార్లు చర్చించానన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచారన్నారు. ఈఈ వెంకటయ్య, డిప్యూటీ ఈఈ రామకృష్ణ, ఏఈ, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

ఆహ్వానం



చాంద్రాయణగుట్ట: త్వరలో ప్రారంభం కానున్న దేవి నవ రాత్రోత్సవాలను పురస్కరించుకొని ఫలక్‌నుమాలోని కాళీమాతను దర్శించుకోవాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన నివాసంలో గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్, సీనియర్ నాయకుడు ఇ.ముత్యం యాదవ్‌లు ఆయనను కలిసి అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందాలని కోరారు.

సన్మానం

సుల్తాన్‌బజార్: ఈఎన్‌టీ ఆసుపత్రిలో రోగులకు ఇబ్బందులు కలుగకుండా వైద్య సేవలను, శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నామని కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనందాచార్య అన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనందాచార్య, ఆర్ఎంఓ డాక్టర్ అనీల్‌కుమార్‌ను టీఎన్జీఓస్ ఈఎన్‌టీ యూనిట్ అధ్యక్షుడు తూముకుంట రాజు ఆధ్వర్యంలో టీఎన్జీఓ బృందం శుక్రవారం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ నాయకులు సునీల్, రవి, సంతోష్ తివారి, అశ్విన్, భాస్కర్, అజ్మత్ అలీ తదితరులు పాల్గొన్నారు.